నవభూమి
కరీంనగర్
అనుబంధం
28 సెప్టెంబర్,2024 శనివారం పేజీలు:3
www.epaper.navabhoomi.in









### అసలే ఆలస్యం..

# ఆపై ఆవేదన



**కరీంనగర్ –నవభూమి:** జాబితాలో పేర్లు లేవని డీఈవో కార్యాలయానికి వచ్చిన 2008 డీఎస్సీ బాధితులు సర్కారు కొలువే లక్ష్యంగా చదివిన వారి ఆశలపై చివరి నిమిషంలో ప్రభుత్వ నిర్ణయం నీళ్లు చల్లింది.. న్యాయం కోసం పోరాడిన వారికి అనుకూలంగా కోర్టులు తీర్పునిచ్చాయి.. ఇది పదహారేళ్ల కిందటి మాట.. బాధితులకు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించినా అర్హుల జాబితా తప్పుల తడకగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది.. 2008 డీఎస్సీలో అర్హత సాధించినా ఉపాధ్యాయ ఉద్యోగాలకు దూరమైన అభ్యర్థులను ఒప్పంద పద్ధతిలో ఎస్జీటీలు(సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు)గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వెబ్‌సైట్‌లో ఉంచిన ఉమ్మడి జిల్లా జాబితాలో చాలా తక్కువ మంది పేర్లుండగా, అందులో అసలైన బాధితుల వివరాలు లేవు. బాధితులు 228 మంది ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 2008 డీఎస్సీలో 970 ఎస్జీటీ పోస్టుల భర్తీ చేపట్టగా రెండేళ్ల అనంతరం ఫలితాలు వెల్లడించారు. 30 శాతం పోస్టులను డీఈడీ అభ్యర్థులకు కేటాయించడంతో దాదాపు 228 మంది బీఈడీ అభ్యర్థులు నష్టపోయారు. ప్రభుత్వ తాజా నిర్ణయం ఆనందాన్నిచ్చినా వెబ్‌సైట్‌లో ఉంచిన జాబితాలో కేవలం 61 మంది పేర్లు మాత్రమే ఉన్నాయి. వాళ్లు కూడా అప్పట్లో రెండు ఉద్యోగాలకు పరీక్ష రాసి, స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన వారే. 16 ఏళ్ల తర్వాత కొలువు దక్కబోతుందన్న బాధితుల సంతోషం జాబితా చూడగానే నీరుగారిపోయింది. రెండు రోజుల కిందట ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి బాధితులు డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. జాబితా రూపకల్పనలో జిల్లా అధికారుల తప్పిదం రాష్ట్ర విద్యాశాఖకు తెలియడంతో గురువారం వెబ్‌సైట్ నుంచి దాన్ని తొలగించారు. శుక్రవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో బాధితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన ఉమ్మడి రాష్ట్రంలో 2008లో డీఎస్సీ నిర్వహించిన సందర్భంగా చివరి నిమిషంలో 30 శాతం పోస్టులను ప్రత్యేకంగా డీఈడీ చేసిన వారికి ప్రభుత్వం కేటాయించింది. ఈ నిర్ణయంతో మార్కుల పరంగా ముందున్న ఎంతో మంది బీఈడీ అభ్యర్థులు నష్టపోయారు. తమకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ పోరాటం చేస్తూనే ఉన్నారు. గత శాసనసభ ఎన్నికలకు ముందు వీరికి న్యాయం చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. పార్టీ అధికారంలోకి రావడంతో ఒప్పంద విధానంలో నియామకానికి విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 27 నుంచి అక్టోబరు 5 వరకు ధ్రువపత్రాల పరిశీలన, తదుపరి పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో వెరిఫికేషన్ పత్రాన్ని అందుబాటులో ఉంచనున్నట్లు ప్రకటించింది. బాధితులు పూర్తి వివరాలు నింపి కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం తీసుకునేందుకు అంగీకరిస్తున్నట్లు సంతకాలు చేయాలని సూచించింది. ఇప్పటికైనా న్యాయం చేయాలి 2008 డీఎస్సీలో అర్హత సాధించినా అధికారుల నిర్ణయంతో ఉద్యోగాలు కోల్పోయాం. విద్యాశాఖ రూపొందించిన జాబితాలో మా పేర్లే లేవు. ఇప్పటికైనా బాధితులకు న్యాయం చేయాలి. టి. స్నేహ, అభ్యర్థిని జాబితాను సరిచేయండి చాలా ఏళ్ల తర్వాత ఒప్పంద ఉద్యోగమైనా దక్కుతుందని సంతోషించా. డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థుల పేర్లు జాబితాలో లేవు. అసలే ఆలస్యం, ఆపై ఇలా చేయడం సరికాదు. జాబితాను సరిచేయాలి.



# నగరంలో కీలకం.. ప్రయాణ నరకం



# నిధుల దుర్వినియోగం



**జగిత్యాల –నవభూమి:** గొల్లపల్లి సహకార సంఘ కార్యాలయం జిల్లాలోని 6 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్), 2 డీసీఎంఎస్ కేంద్రాల్లో నిధులు దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించారు. సహకారశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఇతర జిల్లాల నుంచి వచ్చిన సహకారశాఖ ప్రత్యేక బృందాలు ఈ నెల 10 నుంచి 22 వరకు 6 ప్యాక్స్‌లు, 2 డీసీఎంఎస్ కేంద్రాల్లో తనిఖీలు జరిపారు. 2014–18, 2018–23 సంవత్సరాల్లో ఆయా సంఘాలు, కేంద్రాల్లో జరిగిన లావాదేవీలను తనిఖీ చేశారు. ఈ మేరకు తనిఖీ అధికారులు 23న కమిషనర్‌కు ఇచ్చిన నివేదిక ప్రకారం ధర్మపురి ప్యాక్స్‌లో రూ.1.62 కోట్లు, పెగడపల్లిలో రూ.1.81 కోట్లు, జైనలో రూ.1.55 కోట్లు, నంచర్లలో రూ.96.12 లక్షలు, తిమ్మాపూర్‌లో రూ.67.18 లక్షలు, గొల్లపల్లిలో రూ.53.58 లక్షలు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. ధర్మపురి డీసీఎంఎస్ కేంద్రంలో రూ.6.46 లక్షలు, గొల్లపల్లి డీసీఎంఎస్ కేంద్రంలో రూ.13.07 లక్షలు దుర్వినియోగమైనట్లు తేల్చారు. ప్యాక్స్‌ల ఆధ్వర్యంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా భవనాలు, గోదాములు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం, భూముల కొనుగోలు, పెట్రోలు పంపు నిర్వహణ, ధాన్యం సేకరణలో సామగ్రిని మార్కెటింగ్ శాఖ నుంచి కాకుండా నేరుగా కొనుగోలు చేయటం, వడ్ల కొనుగోలు ఖర్చును అధికంగా చూపటం, ఇతరత్రా నిధులను దుర్వినియోగం చేసినట్లు అధికారులు గుర్తించారు. జిల్లాలోని ఓ ప్యాక్స్‌లో రూ.2.85 కోట్లు దుర్వినియోగమైనట్లు గుర్తించగా మరో మూడు సంఘాల అధికారులు తనిఖీలకు భయపడి ఇటీవల రూ.50 లక్షల వరకు ప్రభుత్వానికి చెల్లించారు. ఈ మేరకు జిల్లాలోని మరికొన్ని సంఘాల్లో నిధుల దుర్వినియోగం జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు. సహకారశాఖ రాష్ట్ర అధికారుల నిర్ణయం మేరకు జైన, ధర్మపురి, తిమ్మాపూర్, నంచర్ల, పెగడపల్లి గొల్లపల్లి ప్యాక్స్‌ల కార్యదర్శులు సాగర్‌రావు, రాజేశ్, ప్రభాకర్, మధుకర్, గోపాల్‌రెడ్డి, రాంసుధాకర్‌రావులను సస్పెన్షన్‌కు ఆదేశాలు జారీచేశారు. ధర్మపురి, గొల్లపల్లి డీసీఎంఎస్ కేంద్రాల నిర్వాహకులపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించారు. నిబంధనల ప్రకారం చర్యలు రాష్ట్ర స్థాయి అధికారులు ఆయా సంఘాల్లో తనిఖీలు చేపట్టగా కమిషనర్ ఆదేశాలు, సహకారశాఖ నిబంధనల ప్రకారం ఆరుగురు కార్యదర్శులపై చర్యలు చేపట్టారు. ఆయా ప్యాక్స్‌ల పాలకమండళ్లకు షోకాజ్ నోటీసులు జారీచేసి వారం రోజుల్లోగా తగిన సమాధానమివ్వకుంటే రద్దుకు చర్యలుంటాయి. ప్యాక్స్‌ల సర్వసభ్య సమావేశం నిర్వహించి చర్చించి తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపించాలి. డీసీఎంఎస్ కేంద్రాల్లో ఉద్యోగులతో కాకుండా ప్రైవేటు వ్యక్తులతో పనిచేయించరాదు. రెండు డీసీఎంఎస్ కేంద్రాలపై చర్యలకు నివేదించాము.



# ప్రాణాలు తీస్తున్న రెండు వరుసల రహదారి

## ఆధునికత వైపు.. అతివల పయనం



**సిరిసిల్ల –నవభూమి:** ఎలక్ట్రానిక్ జకార్డు అమర్చిన మరమగ్గంపై వస్త్రోత్పత్తులు వస్త్రోత్పత్తులంటేనే అద్భుతమైన కళానైపుణ్యం ఉండాలి.తమ అభిరుచికి తోడు ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచనలు చేస్తేనే ఈ రంగంలో రాణింపు సాధ్యం. ఒకప్పుడు చేనేత మగ్గాలపైన కనిపించే మహిళలు నేడు మరమగ్గాల వైపు అడుగులు వేస్తున్నారు. వస్త్రోత్పత్తుల్లో వస్తున్న ఆధునికతను సైతం అందిపుచ్చుకుంటున్నారు. కుటుంబ పోషణకు ఉపాధిగా మార్చుకున్నారు. ఆ ఆత్మవిశ్వాసం వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. మగవారికి దీటుగా మరమగ్గాలను నడిపిస్తున్నారు. ఓవైపు ఇంటి బాధ్యతలు చూస్తూనే కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తూ పలువురికి స్ఫూర్తినిస్తున్నారు సిరిసిల్లకు చెందిన మహిళలు.సిరిసిల్లలో దశాబ్దాల క్రితమే మరమగ్గాల వస్త్రపరిశ్రమ వేళ్లూనుకుంది. పురాతనమైన మగ్గాలపై ఒకే రకమైన ఉత్పత్తులకు పరిమితమవడం వల్ల ఇక్కడి పరిశ్రమ తరచూ సంక్షోభంలోకి వెళ్తుంది. తరాలుగా ఇదే వృత్తిని నమ్ముకున్న నేతన్నలు ఇప్పుడిప్పుడే బహిరంగ మార్కెట్‌లోకి అడుగు పెడుతున్నారు.వివిధ రకాల వస్త్రోత్పత్తులను ఉత్పత్తి చేస్తూ మార్కెట్‌లోనూ తమకంటూ ప్రత్యేకతను చాటుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. నేతన్నలకు ఆయా కుటుంబాల్లోని మహిళలు చేదోడుగా నిలుస్తున్నారు.కాలక్షేపానికి నేర్చుకున్న కళ ఇప్పుడు వారికి అదే వృత్తిగా మారింది.సాధారణ మరమగ్గాలపైనే కాకుండా డాబీ, జకార్డులు అమర్చిన వాటిపైన వస్త్రోత్పత్తుల్లోనూ తమ నైపుణ్యంతో రాణిస్తున్నారు.పట్టణంలో శాంతినగర్, రాజీవ్‌నగర్, అంబికానగర్, బీవైనగర్‌ల్లోని చాలా ఇళ్లలోని కారా?నాల్లో మరమగ్గాలపై వస్త్రోత్పత్తులు నేస్తున్న మహిళలు కనిపిస్తున్నారు. వీరు బీములు పోయడం మినహా మిగతా అన్ని పనులు చేస్తున్నారు. వస్త్రాలకు డిజైన్లు వేయడం, కండెలు చుట్టడం, టాకాలు వేయడం వంటి పనులు చేస్తున్నారు.పిల్లల ఉన్నత చదువులకు...పిల్లలు ఉన్నత చదువులు చదువుతామని పట్టుబట్టారు. కొడుకు ఇంజినీరింగ్ మూడో సంవత్సరం, కూతురు ఇంటర్ రెండో సంవత్సరం. వారి చదువుకు అప్పులు చేయడం కంటే చిన్నప్పటి నుంచి తెలిసిన పని కావడంతో మరమగ్గాలు నడిపించాలని నిర్ణయించుకున్నాను. నా భర్త కొత్త డిజైన్లు తయారు చేస్తుంటారు. వాటికి తగ్గట్టుగా చీరలు, పంచెలు వంటివి నేస్తున్నాను. నాతోపాటు మరో ఇద్దరికి పని కల్పిస్తున్నాను. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం.

## నగరంలో కీలకం.. ప్రయాణ నరకం

**కరీంనగర్ –నవభూమి:** నెలల తరబడి లీకవుతున్న పైపులైను నగరంలో నిత్యం రద్దీగా ఉండే అనుసంధాన రహదారి అది.ఈ మార్గాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రారంభించిన పనులు అర్ధంతరంగా వదిలేయడంతో రాకపోకలకు అవస్థలు ఎదురవుతున్నాయి. కోతిరాంపూర్ నుంచి కట్టరాంపూర్ వెళ్లే అంతర్గత రహదారిపై ప్రయాణించాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది.నగరపాలక సంస్థ పరిధిలో రహదారులు, మురుగుకాలువలు, తాగునీటి పైపులైన్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి హామీ నిధులు(సీఎంఏ) రూ.132.94 కోట్లు కేటాయించారు. గతేడాది అక్టోబరులో నగరవ్యాప్తంగా పనులు ప్రారంభించారు. ఇందులో కొన్ని డివిజన్‌లలో పూర్తి చేయగా, చాలా ప్రాంతాల్లో అసంపూర్తిగా వదిలేశారు. కట్టరాంపూర్ నుంచి కోతిరాంపూర్ వరకు అనుసంధాన రహదారి రెండు కిలోమీటర్లుండగా సగం మేర నిర్మించి వదిలేశారు.గుంతలతో నరకయాతన కోతిరాంపూర్ నుంచి కట్టరాంపూర్, భగత్‌నగర్, దోబీవాడ, గణేశ్‌నగర్, తిరుమల్‌నగర్, హనుమాన్‌నగర్, కలెక్టరేట్, ముకరంపుర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇది దగ్గరి దారి. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా గమ్యం చేరుకోవచ్చు. ఈ మార్గంలో రహదారి నిర్మాణానికి గతంలో ఉన్న సీసీని తవ్వారు. పనులు చేయకపోవడంతో గుంతలు పడ్డాయి. పైపులైన్లు పగిలి తాగునీరు లీకవుతోంది. వర్షం పడితే రోడ్డంతా బురదమయంగా మారుతోంది. రహదారి దుస్థితిపై ఇటీవల వినాయకచవితి సందర్భంగా స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. కొందరు మొరం, కంకరపొడి తీసుకొచ్చి పోసుకున్నారు.వినతుల వెల్లువ కట్టరాంపూర్–కోతిరాంపూర్ రహదారి అధ్వానంగా మారడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రహదారి పనులు పూర్తి చేయాలని కోరుతూ స్థానికులతో పాటు కార్పొరేటర్ ఆకుల నర్మద, నర్సయ్య పలుమార్లు మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి, కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఫలితం లేకపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కట్టరాంపూర్–కోతిరాంపూర్ మార్గంలో గుంతలు పడిన రహదారి ఎవరూ పట్టించుకోవడం లేదు కట్టరాంపూర్ వైపు రహదారి నిర్మాణానికి ఏడాది కిందట తవ్వారు. బాగున్న రోడ్డును చెడగొట్టారు. పెద్ద, పెద్ద గుంతలతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఈ సమస్యపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తాం.చంద్రశేఖర్, కాలనీవాసి వాహనాలు దిగబడుతున్నాయి కోతిరాంపూర్–కట్టరాంపూర్ రహదారిని మరమ్మతులు చేయకుండా వదిలేశారు. ఊరంతా చేసి ఇక్కడ మాత్రం పట్టించుకోవడం లేదు. వర్షం పడితే గుంతలు ఏర్పడుతున్నాయి. అందులో వాహనాలు దిగబడుతున్నాయి. పైపులైన్లు లీకవుతున్నా పరిష్కరించడం లేదు.





## మడత మంచాల్లో చికిత్స-బెడ్‌షీట్ల కొరత

**పెద్దపల్లి –నవభూమి:** ఒకే మంచంలో రోగితో పాటు ఆమె బంధువులు పెద్దపల్లి జిల్లా ఆస్పత్రిలో ప్రతిరోజు ఇవే దృశ్యాలు పునరావృతమవుతున్నాయి. వైద్యసేవలు బాగున్నప్పటికీ వసతుల లేమితో రోగులకు అవస్థలు తప్పడం లేదు. ఆస్పత్రిని 200 పడకల స్థాయికి ఉన్నతీకరిస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆస్పత్రిలో రోగుల సంఖ్య పెరిగితే మడత మంచాలు తీసుకువచ్చారే తప్ప ఆస్పత్రి స్థాయి పెంచకపోవడంతో 50 పడకలకే పరిమితమైంది. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రికి ప్రతిరోజు 800 మంది అవుట్ పేషెంట్లు వివిధ అనారోగ్య సమస్యలతో వస్తుంటారు. వీరిలో సగం మంది జ్వర పీడుతులే ఉండటంతో వైద్యం చేయడమే కష్ట సాధ్యమవుతుంది. చాలా మందికి మడత మంచాల్లోనే చికిత్సలు అందిస్తున్నారు. వీటిపై కూడా బెడ్‌షీట్లు ఉండటం లేదు.మందులకు తప్పని అవస్థలు వైద్యానికి వచ్చే రోగులకు ఆస్పత్రిలో తగినంతగా మందులు అందుబాటులో ఉండటం లేదు. 50 పడకల రోగులకు సరిపడా మందులే ప్రతినెలా వస్తున్నాయి. కేంద్ర డ్రగ్స్ స్టోర్ నుంచి మందుల కొనుగోలు చేయడానికి రూ.67,55,384 పరిమితి ఉంటుంది. వీటిలో ఇప్పటి వరకు రూ.31,82,424 నిధులను మందుల కొనుగోళ్లకు వెచ్చించారు. సర్జికల్ పరికరాలకు రూ.27,78,334 వరకు పరిమితి ఉంటుంది. ఇందులో కూడా సగం కోటా పూర్తయింది. డ్రగ్ స్టోర్‌లో లేని మందులను బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. దీంతో రోగులకు సకాలంలో మందులు అందడం లేదు.పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామానికి చెందిన గట్టయ్య తీవ్రమైన జ్వరంతో గురువారం ఆస్పత్రికి వచ్చారు. మంచాలు ఖాళీ లేకపోవడంతో సిబ్బంది వైద్యసేవలు అందించలేకపోయారు. అవస్థ భరించలేక ఆస్పత్రిలోని కుర్చీలపైనే పడుకున్నాడు.సేవలను విస్తరిస్తాం పెద్దపల్లి జిల్లా ఆస్పత్రిలో గతంలో కంటే రోగుల సంఖ్య పెరగడంతో సేవలను విస్తృతం చేస్తున్నాం. ఆస్పత్రిలోని పాత భవనం సరిపోక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ సంఖ్యలో రోగులు వస్తే మడత మంచాలలో చికిత్స అందిస్తున్నాం. బెడ్‌షీట్ల కొరత లేదు. డ్రగ్‌స్టోర్‌లో లేని మందులను బయట కొనుగోలు చేసి.. రోగులకు చికిత్స అందిస్తున్నాం.





## యువత సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలి



**గణేశ్‌నగర్, –నవభూమి:** మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలను యువత కాపాడాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా యువజన ,క్రీడా శాఖ ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ స్టేడియంలో జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి వ్యక్తిలో ఏదో ఒక కళ దాగి ఉంటుందని దానిని బయట తీయటానికి యువజన ఉత్సవాలు ఉపయోగపడతాయన్నారు. స్వామి వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, యువత తలుచుకుంటే సాధించనిది ఏమీ లేదని అన్నారు. యువత చెడు మార్గంలో పయనించకుండా సన్మార్గంలో పయనించాలని అన్నారు. సామాజిక సేవలో కృషి చేసిన యువజన స్వచ్ఛంద మహిళ సంఘాల సభ్యులకు మెమొంటోలను అందజేశారు. యువజన ఉత్సవాల్లో ప్రతిభ కనబరిచిన వారికి మెమొంటోలు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కలెక్టర్ పమేలా సత్పతికి స్వామి వివేకానంద చిత్రపటాన్ని యువజన సంఘాల సభ్యులు అందజేశారు. జిల్లాలోని కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలకు మంచి స్పందన లభించింది. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి వి శ్రీనివాస్‌గౌడ్, నెహ్రూ యువ కేంద్ర కో ఆర్డినేటర్ వి రాంబాబు, జానపధ కళాకారులు సంగెం రా?ధాకృష్ణ, యువజన అవార్డు గ్రహీతలు కళింగ శేఖర్, సత్తినేని శ్రీనివాస్, అలువాల విష్ణు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం పెరిగి..
# భూగర్భ జలం తరిగి

**కరీంనగర్ –నవభూమి:** కరీంనగర్‌లోని నగరపాలిక పార్కులో నిర్మించిన ఇంకుడుగుంత "ఈ ఏడాది వేసవిలో కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో నీటికి కటకట ఏర్పడింది. ఆ పరిస్థితి రాకుండా ఉండేందుకు ముందస్తుగా మేల్కొనే విధంగా చర్యలు తీసుకోవాలి." ఆరు నెలల కిందట రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు నగరాలు, పట్టణాల్లో రోజురోజుకు జనాభా ఎక్కువవుతుండగా శివారు ప్రాంతాల్లో ఇళ్ల సంఖ్య పెరుగుతోంది. ఖాళీ స్థలాలన్నీ మాయమవుతుండటంతో వర్షం నీరు భూమిలోకి ఇంకడం లేదు. పైగా నీటి సంరక్షణపై ఎవరూ దృష్టి సారించడం లేదు. ప్రతి ఇంటిలో బోరు తవ్వుకోవడం, నీటిని వినియోగించుకోవడం ఎక్కువ అవుతోంది. వృథా నీరంతా కాలువల గుండా వెళ్లి పోతుండటంతో భూగర్భ జలాలు ఏటా తగ్గుతున్నాయి. ఇళ్లలో ఇంకుడుగుంతలు నిర్మించాలన్న ఆదేశాలున్నా ఎవరూ పాటించడం లేదు. తాజాగా పురపాలక శాఖ 300 చ.మీ.ల విస్తీర్ణంలో ఉన్న ప్రతి ఇంటిలో ఇంకుడుగుంత నిర్మించాలని ఆదేశించింది. ఈసారైనా ఆదేశాలు అమలవుతాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురియకపోవడంతో ఈ ఏడాది వేసవి ప్రారంభంలోనే తాగు, సాగునీటికి ఇబ్బందులు పడ్డారు. వర్షాలు సైతం ఆలస్యంగా కురియడంతో కాస్త నీటి నిల్వలు పెరిగినప్పటికి.. భూగర్భ జలాలు పెంచుకోవాలనే ఆవశ్యకతను గుర్తించడం లేదు. కరీంనగర్, రామగుండం నగరాలతో పాటు మున్సిపాలిటీల్లో కచ్చితంగా ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని పేర్కొంటున్నా పట్టించుకోవడం లేదు. కొత్తగా ఇళ్లను నిర్మించుకునే వారు సైతం ఆ వైపే దృష్టిసారించడం లేదు. అనుమతులకే పరిమితం ఇంటి నిర్మాణ సమయంలో అనుమతులు తీసుకునే సమయంలో పట్టణ ప్రణాళిక విభాగంలో కొంత మొత్తాన్ని ఇంటి యజమానులు ఫీజు చెల్లిస్తున్నారు. చదరపు మీటర్ చొప్పున సుమారు రూ. 2 వేల వరకు డిపాజిట్ చేస్తున్నారు. ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత ఇంకుడుగుంత నిర్మిస్తే ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. ఎక్కడా ఆ నిబంధనలు అమలు కావడం లేదు. అనుమతులు ఇచ్చిన అధికారులు దానిని నిర్మించారా? లేదా? అనేది మాత్రం పరిశీలించడం లేదు. పైగా రూ.లక్షల్లో జమ అయిన ఆ మొత్తాన్ని ఇతర



అవసరాలకు ఇన్నాళ్లు వినియోగిస్తున్నారు. 300ల చదరపు మీటర్లకు తప్పనిసరి మున్సిపాలిటీలు, నగరాల్లో 300 చదరపు మీటర్లకు మించిన అన్ని నిర్మాణాల్లో ఇంకుడుగుంత తప్పనిసరి చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఉన్న భవనాల్లో ఏడాదిలో నిర్మించుకోవాలి. ఆక్యుపెన్సీ కం కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చేటప్పుడు ఇంకుడుగుంత నిర్మించారా లేదా క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. వీటిని నిర్మించుకునేలా ప్రజల్లో చైతన్యం తెచ్చే బాధ్యత కూడా మున్సిపల్ కమిషనర్లదేనని ఉత్తర్వులో వివరించారు. కరీంనగర్ నగర పరిధిలో 300 చదరపు మీటర్లు ఉన్న భవనాలు 791 ఉన్నట్లుగా ఇటీవల నిర్వహించిన సర్వేలో గుర్తించారు. ఇప్పటికే 458 బహుళ అంతస్తులో నిర్మించుకున్నారు. మిగతా333 భవన యజమానులకు నోటీసులు ఇచ్చారు. అందులో 24 భవనాల్లో కొత్తగా నిర్మించుకున్నారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో ప్రభుత్వ కార్యాలయాల్లో ఆధునాతన సాంకేతికను జోడించి ఇంకుడుగుంతలు నిర్మిస్తున్నారు.

# ప్రాణాలు తీస్తున్న రెండు వరుసల రహదారి

**ఎల్లారెడ్డిపేట –నవభూమి:** డివైడర్‌ను తాకి పల్టీకొట్టిన వాహనం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం నుంచి రాచర్ల గొల్లపల్లి శివారు వరకు నిర్మించిన రెండు వరుసల రహదారి ప్రమాదాలకు నెలవుగా మారింది. ఈ ప్రాంతంలో తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలతో పలువురు ప్రాణాలు కోల్పోతుండగా మరికొందరు క్షతగాత్రులై ఆసుపత్రుల పాలవుతున్నారు. రోడ్డు నిర్మాణంలో అధికారులు నిబంధనలను తుంగలో తొక్కడమే ఇందుకు ప్రధాన కారణం. రోడ్డు నడుమ తక్కువ ఎత్తులో నిర్మించిన డివైడర్ వాహనదారులకు శాపంగా మారింది. భారీ వ్యయం.. పనులు నామమాత్రం ఎల్లారెడ్డిపేట మండలంలో రోడ్లు, భవనాలశాఖ నిధులు రూ. 15 కోట్ల అంచనా వ్యయంతో కామారెడ్డి–కరీంనగర్ ప్రధాన రహదారిని రెండు వరుసల రహదారిగా విస్తరించారు. మండల కేంద్రం నుంచి రాచర్ల గొల్లపల్లి శివారు వరకు 4.4 కిలోమీటర్ల మేర విశాలమైన రహదారిని అన్ని హంగులతో తీర్చిదిద్దారు. మండల కేంద్రం నుంచి రాచర్ల గొల్లపల్లి శివారు వరకు మూడు అడుగుల ఎత్తులో నిర్మించాల్సిన డివైడర్‌ను కేవలం 9 ఇంచుల ఎత్తుకే పరిమితం చేశారు. బస్టాండ్లు, ప్రధాన ప్రాంతాల్లో ఓవైపు నుంచి మరోవైపునకు రోడ్డు దాటే ప్రాంతాల్లో (యూటర్న్) రంబల్ స్ట్రిప్స్, థర్మోప్లాస్టిక్ పెయింటింగ్స్‌తోపాటు సోలార్ బ్లింకర్స్ వంటి ఏర్పాట్లను గాలికొదిలేశారు. యూటర్న్ ప్రదేశాల్లో డివైడర్‌లో సుమారు 20 మీటర్ల దూరం వరకు చెట్లు ఉండకూడదని తెలిసినా పట్టించుకోలేదు. ఎక్కడా వేగ నియంత్రికలు ఏర్పాటు చేయకపోవడం వల్ల వాహనాలు మితిమీరిన వేగంతో దూసుకెళ్తున్నాయి. యూటర్న్ తీసుకునే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు నిర్మాణంలో నాణ్యతను విస్మరించడంతో అనతికాలంలోనే అక్కడక్కడ భారీ గుంతలు ఏర్పడ్డాయి. వాహనాలు ఒక్కసారిగా గుంతల నుంచి వెళ్లగానే అదుపు తప్పుతున్నాయి. పోలీసుల రికార్డుల ప్రకారం 2023లో ఇద్దరు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. 2024లో ఇప్పటి వరకు ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, 10 మంది గాయపడ్డారు. పోలీసు కేసులు నమోదు కానివి చాలా ఉన్నాయి. గడిచిన 21



నెలల్లో సుమారు 60 మంది వరకు గాయపడ్డారు. ఎన్నో వాహనాలు ధ్వంసమయ్యాయి. రోడ్డు ప్రమాదంలో తనువుచాలించిన తన కుమారుడు వేముల బాలు ఫొటో చూపిస్తున్న ఈమె పేరు వేముల రామవ్వ. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామస్థురాలు. జులై 18న రాత్రి సొంత పని మీద బాలు తన ద్విచక్రవాహనంపై రాచర్ల గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపు వెళ్తుండగా వాహనం అదుపు తప్పి డివైడర్‌కు తగలడంతో కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కుటుంబ పోషణలో పెద్ద దిక్కుగా ఉండే యువకుడిని కోల్పోవడంతో ఆ కుటుంబం వీధిన పడింది. మనవడు రియాన్స్, మనవరాలు స్వేచ్ఛ తండ్రి లేని వారుగా మిగిలిపోయారు. రూ. 60 లక్షలతో ప్రతిపాదనలు ఆర్‌అండ్‌బీ రెండు వరుసల రహదారిలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వేగ నియంత్రణ ఏర్పాట్ల కోసం రూ. 60 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం నుంచి రాచర్ల గొల్లపల్లి శివారు వరకు రెండు వరుసల రహదారిని నాణ్యతతో నిర్మించాం. రూ. 15 కోట్లు చాలకపోవడంతో డివైడర్ ఎత్తును పెంచలేకపోయాం. మరో రూ. 1.50 కోట్లు కావాలని ప్రభుత్వానికి నివేదించాం. కిరణ్, ఏఈ, ఆర్‌అండ్ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. ఎల్లారెడ్డిపేట నుంచి రాచర్ల గొల్లపల్లి వరకు డివైడర్‌లో యూటర్న్ ప్రాంతాలు ఎక్కువగా ఉండగా అక్కడ కొద్దిదూరం మేర చెట్లను తొలగింపజేశాం. బస్టాండ్లు, పెట్రోలు బంకులు తదితర ప్రధాన కూడళ్లలో స్టాపర్లను ఏర్పాటు చేశాం.

